
# పిల్లనగ్రోవి

కుప్పిలి పద్మ



పాలసముద్రమంతా చిమ్మనగోలలోంచి చిమ్మబడుతూన్నట్లు- పండు వెన్నెల. కన్నతల్లి మమత వంటి ఆ ప్రశాంత నిశ్శబ్దంలో ఎట్టి జోలపాట వినిపిస్తోందో గానీ, ప్రపంచం ఆదమరచి హాయిగా నిదురిస్తోంది. వీధిలో రెండో ఆట సినిమా చూసి ఇళ్ళకు తిరిగి వస్తూన్న జనం రద్దీ తగ్గిపోయింది. ఫకీరు మేలుకొలుపు. దానికి తోడుగా తప్పెట మోత క్రమంగా దగ్గరౌతున్నాయి.

పాల లచ్చన్న యింటి నడవలో కట్టివేయబడివున్న చియ్యి బలిసిన కోడెదూడ చొంగలు కార్చుకుంటూ బుసలుగొట్టుతోంది. నట్టింట పాల లచ్చన్న చాపమీద పడుకొని నిద్రపోతున్నాడు. ఇంటి వెనక దొడ్లో అతనికున్న కొద్దిపాటి పశువులు నేలపై మోకరిల్లి అరమోడ్పు కనులతో నెమరువేసుకుంటున్నాయి. డాబాపైన అతని పెళ్ళాం బాలమ్మ, కొడుకూ, కూతురూ వెన్నెల్లో పడుకున్నారు.

వీధి తలుపుకి గొలుసుచుట్టి తాళం వేసి ఉన్నా, నడవలోనికి గాలీ వెలుతురూ ప్రవేశించడానికి ఏ అడ్డంకీ లేదు. ఎందుకంటే, ముందువైపు ఇనుప ఊచల చట్రం బిగించారు. నడవలోనుంచి డాబా పైకి మెట్లున్నాయి. తన కండబలానికి నిదర్శనంగా ఆ కోడెదూడ గొలుసుతో ఇనుప ఊచకు కట్టివేయబడి ఉంది. నడవకూ, నట్టింటికీ నడుమనున్న తలుపు తెరిచి ఉంది. బయట వెన్నెల; ఇంటి లోపల మసక చీకట్లు.

కోడె ఇనప కటకటాల్లోంచి వీధిలోకి చూస్తోంది. వీధిలో-ఫకీరు పాట పాడుతూ వస్తున్నాడు.

లచ్చన్న ఇంటి ఎదురింట్లో ఒక ముస్లిం కుటుంబం కాపురముంది. ఫకీరు ఆ ఇంటి ఎదుట నిలబడ్డాడు. ఘల్లుఘల్లున కనక తప్పెట మీద దరువు వేస్తూ, గట్టిగా పాట లకించుకున్నాడు. రంజాన్ నెల ఉపవాసాలు పూర్తయ్యేవరకు ఊళ్ళోని ముస్లిం సోదరులకు నిత్యం మూడో జామునే మేలుకొలుపులు పాడటం అతడి విధి.

...డాబా మీద పడుకున్న బాలమ్మ, పిల్లలూ అదిరిపడి లేచారు. గొడ్డు పెడబొబ్బ పెట్టినట్లు ఆ ఆక్రందనం మళ్ళీ వినిపించింది. నిద్రలో జడుసుకున్న వారి ఉలికిపాటులాంటి కేక అది! ముగ్గురూ స్థాణువులైపోయారు. 'అంబా! అంబా!' అంటూ కోడె బిగ్గరగా రంకెలు వేస్తోంది. ఫకీరు పాట, తప్పెటమోత దూరదూరమైపోతూ వినిపిస్తున్నాయి

పక్కన వేపచెట్లో బెదిరిపోయిన గువ్వ గూట్లో సర్దుకుంటున్న చప్పుడు, ఇంటి ముందర ఊరకుక్క మొరిగిన సవ్వడీ...

నడవలోని కోడెదూడ తప్పెట మోతకు జడుసుకున్నది కాబోలు, తన శక్తినంతా ప్రయోగించి గొలుసును గటిగా గుంజింది. గొలుసు తెగింది. కోడె వెనుదిరిగి, చిందులు తొక్కుతూ నట్టింట్లోకి దూరింది.

...డాబా మీద పడుకున్న బాలమ్మ, పిల్లలూ అదిరిపడి లేచారు. గొడ్డు పెడబొబ్బ పెట్టినట్లు ఆ ఆక్రందనం మళ్ళీ వినిపించింది. నిద్రలో జడుసుకున్న వారి ఉలికిపాటులాంటి కేక అది! ముగ్గురూ స్థాణువులైపోయారు. 'అంబా! అంబా!' అంటూ కోడె బిగ్గరగా రంకెలు వేస్తోంది. ఫకీరు పాట, తప్పెటమోత దూరదూరమైపోతూ వినిపిస్తున్నాయి.

బాలమ్మ, పిల్లలూ తెలియరాని భయంతో, ఆతురతతో కిందికి పరుగుతీశారు. నడవలో గొడ్డులేదు. నట్టింట్లో లచ్చన్న మూలుగు వినబడుతోంది. "ఏం జరిగింది?" అంది బాలమ్మ ఆదుర్దాగా.

"ఏం లేదులే! ఆ లైటు వెయ్యి!" అన్నాడు లచ్చన్న హీన స్వరంతో. ఆమె లైటు వేసింది. లచ్చన్న చాపమీద లేచి కూర్చుని, కోడెమెడ నిమురుతూ ఉన్నాడు. అది తన పొడుగాటి నాలుకతో అతని ఒళ్ళంతా నాకుతోంది... ఈ దృశ్యం చూడగానే, జరిగిందేమిటో ఊహించుకోగలిగింది బాలమ్మ.

...దూడ కట్టు తెంచుకొన్నది; నట్టింట్లోకి దూరింది; చీకట్లో భర్తను తొక్కేసింది. హఠాత్తుగా జరిగిన ఈ సంఘటనతో - నిద్రపోతున్న లచ్చన్న కాస్తా హడలిపోయి వెర్రివాడిలా అరిచేశాడు!

"తొక్కేసిందా? దెబ్బలేమన్నా తగిల్నాయా?" అంది బాలమ్మ జలపాతంలా.

వేగంగా కొట్టుకుంటున్న గుండెను అదుపులో పెట్టుకుంటూ, "లేదులే, పాపం...ముందు..దీన్ని కట్టేసిరా" అన్నాడు లచ్చన్న నింపాదిగా.

బాలమ్మ దాన్ని యథాప్రకారం కట్టేసింది.

లచ్చన్న వెన్ను రాచుకుపోయింది. ఎడమచేతి అరచేయి నుజ్జునుజ్జయిపోయింది. లచ్చన్న దాన్నేమీ లెక్కచేయలేదు. నిర్లక్ష్యంగా గాయానికి తడిగుడ్డ చుట్టి, ఏమీ జరగనట్లే పడుకుని నిద్రపోయాడు.

అతడి చేతిగాయం మానలేదు. రోజురోజుకూ బాధ ఎక్కువైంది. అరచేయి కుళ్ళిపోయింది. పట్నం వెళ్ళి పెద్దాసుపత్రిలో నెల నాళ్ళున్నారు.

బాలమ్మకు ఆ కోడెపై మమకారం మాయమైపోయి, చిరాకూ కోపమూ పుట్టుకొచ్చాయి. చీటికీమాటికీ దాన్ని తెగ బాదుతూ ఉండేది. నాలుగే నాలుగు గడ్డిపరకలు విదిల్చి, దాని కడుపు మాడ్చేది. కుడితి తొట్లో నీళ్ళు తాగబోతే, దాని వీపు మీది తాట ఒలిపించేది. ఈ విధమైన నిరాదరణతో ఆ దూడ మొండిబారిపోయింది. అప్పుడప్పుడూ తిరగబడి ఆమెను కుమ్మబోయేది.

లచ్చన్న ఆస్పత్రి నుంచి తిరిగివచ్చాడు. అతని చేతిగాయం మానింది కానీ, ఆ గాయం స్థానే ఒక వైకల్యం ఏర్పడిపోయింది. ఎంత ప్రయత్నించినా అతని చేతివేళ్ళు వంగవు. నిటారుగానే ఉండిపోతై.

ఇది చూచి బాలమ్మ కడుపు రగిలిపోయింది. దూడను శాపనార్థాలు పెట్టింది.

...మరునాటి ఉదయం ఆ దూడ కుడితినీరు తాగుతుండగా, "నీ కడుపు బద్దలు గానూ! అది కడుపా, లేకుంటే చెరువా? ఇకచాలు, పద!" అంటూ ముక్కుదాడు పట్టి గుంజింది బాలమ్మ.

అది ఆమెను కొమ్ములతో బెదరకొట్టింది. బాలమ్మ రెచ్చిపోయి, పాకచూరులోని జాటీకర్రలాక్కుని, భర్త వారిస్తున్నా వినకుండా దూడ ఒళ్ళంతా ఛెళ్ళుఛెళ్ళుమనిపించింది. లచ్చన్న కోపంగా ఆమె చేతిలోని జాటీకర్రను లాక్కుని, "చెప్తే నీక్కాదూ? నోరులేని పశువు- అది నిన్నేం జేసిందని?" అంటూ ఆ జాటీతోనే ఆమెకు రెండు తగిలించాడు.

....ఈ పదిహేనేళ్ళ కాపురంలో మొగుడిచేత దెబ్బలు తినటం బాలమ్మకు ఇదే మొదటిసారి.... బిత్తరపోయిందామె.

... అమ్మాయి పాలు పితుకుతోంది. ఆ ఆవు పొదుగులోంచి లచ్చన్న మనస్సు పాలై ప్రవహిస్తోంది. కోడెదూడ అరమోడ్పు కన్నులతో అతడి అరచేతిని నాకుతూ నిలుచుంది.

.... ఆ స్పర్శలో - అతని హృదయం పిల్లనగ్రోవియై, ఏదో చల్లటి పాట పాడుతూ ఉండటం ఆ నోరులేని పశువు వినగలిగింది. ◀

# పాటే నా ప్రపంచం: అల్తాఫ్ రాజా



సాధారణంగా ఒకసారి మనసుకు నచ్చిన సంగీతం మరోమారు పాతబడిపోతుంది. కానీ అల్తాఫ్‌రాజా విషయంలో ఈ విషయం వర్తించదు. 'పర్‌దేశీ..పర్‌దేశీ జానా నహీ.. ముఝే ఛోడ్‌కే..' దేశాన్ని ఒక ఊపు ఊపేసిన పాట. స్వచ్ఛమైన మెలోడీని స్వాప్నికులు ఎంత హృద్యంగా ఆస్వాదిస్తారనేది మరోసారి రుజువైంది. అల్తాఫ్ రాజా అక్కడే వున్నాడు. ప్రవాస భారతీయులు కూడా అమితంగా ఆదరించిన ఈ పాట అల్తాఫ్‌ను తారాసీమకు చేర్చింది. ఒక మానసి అంతరంగ స్వరూపాన్ని అంత హృద్యంగా చిత్రించిన ఈ పాట అల్తాఫ్‌ను జనబాహుల్యానికి మరింత దగ్గరికి చేర్చింది.

ముంబాయి నివాసిగా మారిన అల్తాఫ్ అసలుకు హైదరాబాదీ. ఆరంభంలో పాడిన గజల్స్ అల్తాఫ్‌కి ఒక విభిన్నమైన పేరునూ, రూపాన్నీ తెచ్చిపెట్టాయి. ఎమ్ టీవీ ప్రకటనల్లో అల్తాఫ్ సామాన్య ప్రజానీకానికి చేరువయ్యాడు. మనుషుల్లోని ప్రేమ, ఆసక్తి, నిరాసక్తతలు, సందర్భానుసారపు సన్నివేశాలు అంత గంభీరంగా, మంద్రంగా పాడగలగటంలో అల్తాఫ్‌ది ఒక విభిన్నమైన శైలి.

సంగీతానికి అతను చిరపరిచితుడే అయినా - వెలుగులోకి వచ్చింది మాత్రం ఇటీవలికాలంలోనే! అల్తాఫ్ నేర్చుకుంది స్వచ్ఛమైన శాస్త్రీయ సంగీతం. పాడుతోంది భిన్నరీతుల్లో. ముంబాయిలో అవకాశాల కోసం ప్రయత్నించకముందు అల్తాఫ్ జరుగుబాటు కోసం చాలా బాధలు పడ్డాడు.

90'ల్లో గాయకులకు కొత్త అవకాశాలు ఏర్పడ్డాయి. వాళ్ళకి మంచి బూస్ట్ లభిస్తున్న కాలం. క్యాసెట్ కంపెనీలు తమ ప్రత్యేక ఆల్బమ్స్ కోసం కొత్త గాయకులను ప్రోత్సహించటం మొదలుపెట్టాయి. అల్తాఫ్ కూడా అలాగే ఎదిగాడు. గజల్ సంగీతం మీద వున్న అభిరుచి, టీవీ రంగంలో అనుభవం అల్తాఫ్‌కి బాగా ఉపయోగపడ్డాయి. నెమ్మదిగా అతనికి భవిష్యత్ మీద నమ్మకం పెరిగింది. 'మన అల్తాఫ్ భాయ్' అని అందరూ సుపరిచితంగా పిలుచుకునే దాకా అతను ఎదిగిపోయాడు. అయినా, అతను పాతరోజులు మర్చిపోలేదు. ఇంటర్వ్యూ ఇమ్మన్నప్పుడు చిరునవ్వుతో ఓకే అనేశాడు.

**హైదరాబాద్‌లో లైవ్‌షో ఎలా అన్పించింది..?**

- చాలా బావుంది. దేశంలో ముంబాయి, పూనా, కలకత్తా, అలాగే మస్కట్, దుబాయ్,లండన్, యుఎస్ఎ లాంటి విదేశాల్లో ప్రదర్శనలిస్తున్నాను. నిజానికి నాకు ప్రయాణం చేయటమంటే చాలా ఇష్టం. ఈ రూపంలో ప్రజలకు చేరువ కావటమంటే నాకు నచ్చుతుంది.

**మీ సాధారణ దైనందిన జీవితం గురించి చెప్పండి.**

- సోమవారాలు మాత్రమే నాకు అలాంటి రెస్ట్ దొరుకుతుంది. కానీ, పాటకు అలవాటు పడిన ప్రాణానికి రెస్ట్ ఏమిటి? అందుకే పాటకు దగ్గరగా వుంటుంటాను. ప్రదర్శనల కోసమే ఆ టైమ్ వెచ్చిస్తుంటాను.

**మీ వ్యక్తిగత అభిరుచులు..**

- చాలా సాధారణమైనవి. బాగా చదవటానికి ఇష్టపడతాను. అయితే నా అసలైన అభిరుచి పాటే! ఉర్దూ గజల్ లేకుండా నా ప్రాణం లేదు. అలాగే, సంగీతం వింటానికి కూడా ఇష్టపడతాను. అయితే, అది వృత్తికి సంబంధించింది కాబట్టి - నన్ను నేను మరింత మెరుగుపరుచుకోవటం కోసం మాత్రమే ఉపయోగపడుతోంది.

**టాప్‌సింగర్‌కి ఎలాంటి కృషి అవసరం?**

- పాటని ప్రేమించగలగాలి. పాటమీద అంకితభావం, క్రమశిక్షణ, మంచి ప్రాక్టీస్ వుంటే చాలు. అందుకు అదృష్టం తోడై, అవకాశాలొస్తే.. ఆ స్థానం అందుకోవటం గగనం కాదు.

**మీ ఫేవరెట్ సింగర్స్..**

- మహ్మద్ రఫీ, గులామ్ అలీ. వీళ్ళిద్దరూ నాకు రెండు కళ్ళలాంటి పాటగాళ్ళు. ఇక లతా మంగేష్కర్ జీ. హృద్యమైన పాట వినాలంటే ఆమె నోటినుంచే వినాలి. ఎంత మంది కొత్త గాయకులు వచ్చినా లతా జీ గొంతును బీట్ చేయలేరు. ఆ గొంతులో మెలోడీ పలికే తీరు అలాంటిది.

**గాయకుడిగా పై స్థానానికి చేరారు. అప్పుడప్పుడూ పాటల్లో కనిపిస్తున్నారు. అంటే, నటుడిగా ప్రయత్నిస్తున్నారా?**

- నేను కొన్ని సినిమాలు చేశాను. అయితే అవన్నీ నేను పాడిన పాటలతో.. ఆ పాటలు పాడుతూ..! సినిమారంగం నన్ను కోరుకుంటే నటించటానికి అభ్యంతరం లేదు. అయితే నా అసలైన ప్రాణం పాటమీదే!

- ముఖి